తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# దక్షిణామూర్తికి విశేషపూజలు.. అభిషేకాలు




శ్రీకాళహస్తి, నవంబర్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి కార్తీకమాసం గురువారం సందర్భంగా విశేష అభిషేకాలు చేశారు. పాలు, పెరుగు, చందనం, కొబ్బరినీళ్ళు తదితర సుగంధద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించి విశేష అలంకరణ చేపట్టారు. అనంతరం స్వామివారికి భక్తులు సమర్పించిన ప్రత్యేకంగా మాలతో అలంకరించారు. పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొని స్వామివారి పూజల్లో పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అలంకరణ అనంతరం హారతులిస్తున్న దృశ్యం

## గ్రామ కంఠం రీసర్వేని
# పకడ్బందీగా నిర్వహించాలి

**జగనన్న స్వచ్ఛ సంకల్పంను పక్కాగా అమలు చేయాలి**
**ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి**
**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది**



తిరుపతిరూరల్, నవంబర్ 3 ప్రభాతవార్త:

గ్రామ కంఠం ఆస్తుల రీ సర్వే పక్కాగా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పేర్కొన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామాలలో సంపూర్ణ పారిశుధ్యం, సంపద కేంద్రాల నిర్వాహణపై దృష్టి పెట్టాలన్నారు. గురువారం పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి గ్రామ సచివాలయాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, లేబర్ మొబలైజేషన్ తదితర అంశాలపై విజయవాడ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో కమీషనర్ కోన శశిధర్‌తో కలిసి ద్వివేది సమీక్షించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జె.సి. డి.కె.బాలాజీ సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గ్రామ కంఠం రీ సర్వే పక్కాగా నిర్వహించాలని, ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. జగనన్న భూ హక్కు - భూ రక్ష పథకం కింద గ్రామాలలో గ్రామ కంఠం కిందకు చెందిన ప్రభుత్వ భవనాలు, రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు, చెరువులు తదితర వాటి సర్వే పకడ్బందీగా నిర్వహించి, ఎలాంటి గొడవలు లేకుండా సంబంధిత ప్రొఫార్మలో సమాచారం సిద్ధం చేసి సెక్షన్ 13 నోటీసులు, ఆర్ ఓ ఆర్, స్వామిత కింద భూ హక్కు పత్రాలు అందించే దిశగా చర్యలు చేప ట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ అసిస్టెంట్ గ్రామ కంఠం పరిధిలోని ఆస్తులను స్వయంగా పరిశీలించి, పక్కాగా నాణ్యతగా ఉండేలా చేపట్టాలన్నారు. అప్పిలేట్ అధికారిగా సర్వే అధికారులు, డిప్యూటీ తహశీల్దార్లు ఉంటారని తెలిపారు. ఉపాధి హామీల కూలీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో పి.డి. డ్వామా శ్రీనివాస్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ విజయకుమార్, డిపిఒ రాజశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హనీ ట్రాప్‌లో రియల్ వ్యాపారి

**కళ్ళలో కారం కొట్టి రూ.35 లక్షలు రాబరి చేసిన దుండగులు**
**నిందితులను పట్టుకున్న ఎంఆర్‌పల్లి పోలీసులు**

తిరుపతి క్రైం, నవంబర్ 3, ప్రభాతవార్త

హనీ ట్రాప్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఘరానా మోసానికి గురయ్యాడు. బాధితులు తెలిపిన కథనం మేరకు..యాదాద్రి జిల్లా చౌటుప్పల్ చెందిన కె. శంకర్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. శంకర్‌కి ఫోన్ ద్వారా మనీ, మంజుల, లక్ష్మి ముగ్గురు మహిళలు పరిచయమయ్యారు. ఈ ముగ్గురు ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు శంకర్‌ని హనీ ట్రాప్ చేశారు. 35 లక్షల రూపాయలు నగదు ఇస్తే ఆన్‌లైన్ ద్వారా రూ.75 లక్షలు తన అకౌంట్‌లో జమ చేస్తామని నమ్మించారు. అయితే ఆ అకౌంటు ఓ ట్రస్ట్‌కి సంబంధించి ఉండాలని శంకర్‌కి చెప్పారు. దీంతో శంకర్ తనకి తెలిసిన అపస్థాలింగ్ మిషన్ చర్చి ఫాదర్ మార్టిన్ లూథర్ కలిశాడు. రూ.35 లక్షలు నగదు కావాలని తిరిగి ట్రస్ట్‌కి రూ.70 లక్షలు వస్తుందని,దాని ద్వారా చర్చికి తనకి మంచి జరుగుతుందని చర్చి ఫాదర్ చెప్పాడు. చర్చి ఫాదర్ శంకర్‌కి నగదు ఇస్తానని చెప్పాడు. దీంతో ఈ నెల ఒకటోతారీకు శంకర్ తన స్నేహితుడు జయపాల్, చర్చికి సంబంధించిన ప్రభాకర్, రాజ్‌కుమార్ తీసుకుని రాత్రి 7 గంటలకు చౌటుప్పల్ నుంచి తిరుపతికి బయల్దేరాడు. 2వ తేదీ ఉదయం సుమారు 5 గంటల సమయంలో తిరుపతికి చేరుకున్నారు. బస్టాండ్ సమీపంలో హోటల్‌లో బస చేసారు. ఉదయం మనీ, మంజుల, లక్ష్మీలకు శంకర్ ఫోన్ చేసి తిరుపతికి వచ్చినట్లు తెలిపాడు. ఆ ముగ్గురు మహిళలు బస్టాండ్ వద్ద ఓ ప్రైవేట్ హోటల్లో ఉంటున్నామని అక్క డికి రావాలని చెప్పారు. శంకర్ తన స్నేహితులతో కలిసి హోటల్ వద్దకు వెళ్లాడు. ఆ మహిళలు డబ్బులు తీసుకు వచ్చారని అడగగా డబ్బులు బ్యాంకులో ఉన్నాయి. తీసుకొస్తామని చెప్పారు. వాళ్ళు వచ్చే సమయమైందని, డబ్బులు తీసుకురావాలని ఆ ముగ్గుర మహిళలు శంకర్‌కి చెప్పారు. దీంతో శంకర్ తిరుపతిలో బ్యాంకు వద్దకు వెళ్లి తన అకౌంట్‌లో ఉన్న 20 లక్షల రూపాయలను తిరుపతికి చెందిన ఓ వ్యక్తి ఎకౌంట్‌కు ట్రాన్స్ ఫర్ చేశాడు. అదే వ్యక్తి అకౌంట్‌కి చర్చి ఫాదర్ 15 లక్షలు ట్రాన్స్ ఫర్ చేసారు. ఆ వ్యక్తి 30 లక్షల నగదు తీసుకుని బ్యాంకు వద్ద శంకర్‌కి అప్పగించాడు. శంకర్ తన కారులో నగదు తీసుకుని వెళ్ళాడు. ఆ మహిళలు సార్ వస్తారంటూ రాత్రి వరకు కాలయాపన చేశారు. బుధవారం రాత్రి మంజుల మురుగేష్ అనే ఒక వ్యక్తిని శంకర్‌కి పరిచయం చేసింది. మురుగేష్ శంకర్‌ను తాజ్ హోటల్ వద్దకు రావాలని సార్ వాళ్ళు అక్కడికి వస్తారని చెప్పాడు. శంకర్ నగదు ఉన్న బ్యాగుతో తన స్నేహితులను తీసుకుని తాజ్ హోటల్ వద్దకు చేరుకున్నారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో మురుగేష్ డబ్బులు బదిలీ చేయటానికి సార్ వాళ్ళు వచ్చారని శంకర్ తన స్నేహితులతో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రావాలని చెప్పాడు. ఆర్టీసీ బస్టాండ్ చేరుకున్న శంకర్‌తో పాటు మురుగేష్ కారులో ఎక్కి వాళ్ళు చంద్రగిరి హైవే రూట్ వద్ద ఉన్నారని అక్కడైతే నగదు లావాదేవీలకు ఇబ్బంది కలగదని నమ్మించి తీసుకెళ్లాడు. హైవే వద్ద జిఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్ వద్ద వాహనం ఆపి నగదు ఉందా లేదా అని మురుగేష్ పరిశీలించాడు. పది నిమిషాల్లో సార్ వాళ్ళు ఇక్కడ చేరుకుంటారని శంకర్‌ని నమ్మించాడు. పథకం ప్రకారం మురుగేష్ తన గ్యాంగ్‌తో ఉన్న వాహనం చేరుకుని మురుగేష్, శంకర్, అతని స్నేహితులు కళ్లలో కారం కొట్టి నగదు ఉన్న బ్యాగు తీసుకుని ఆ కారులో పరారయ్యాడు. ఏం జరిగిందని తెలుసుకునే లోపు బ్యాగ్‌తో మురుగేష్ పరారయ్యాడు. జరిగిన విషయాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు అనే స్థానికుడు డయల్ 100 ద్వారా పోలీసు సమాచారం ఇచ్చారు. ఎంఆర్ పల్లి సురేంద్రనాథ్ రెడ్డి ఎస్ఐ వినోద్‌కుమార్, బ్లూ కోట్, రక్షక్ పోలీసులు నిందితుల వాహనాన్ని చేజ్ చేసి అద్దంకి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఓ బ్యాగ్, కుప్పంకి చెందిన ఏడు మందిని యువకులను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఏడుగురిని, ఓ బ్యాగ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు అసలు నిందితుడు మురుగేష్ పరారైనట్లు తెలిపారు. పోలీసులకు లభ్యమైన బ్యాగులో నగదు లేదని, నగదు వున్న బ్యాగ్‌ని మురుగేష్ తీసుకుని పరారైనట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్రైం అదనపు ఎస్పీ విమల కుమారి ఆధ్వర్యంలో వెస్ట్ డిఎస్‌పి నరసప్ప క్రైం డిఎస్పి సుధాకర్, సిఐలు సురేంద్ర నాథ్ రెడ్డి, శివప్రసాద్ బృందాలుగా ఏర్పడి మురగేష్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.



సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# కట్టుకున్న భార్య కనుసన్నల్లోనే..హత్య

గంగవరం, నవంబరు 3, ప్రభాతవార్త :

అక్టోబరు 31న పెద్దపంజాణి మండలం తుర్లపల్లె గ్రామ సమీపంలో జరిగిన భర్త దామోదరం హత్యకు వివాహేతర సంబంధమే ప్రధాన కారణమని పలమనేరు డిఎస్పీ సిఎం గంగయ్య తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు మండలం నెక్కుంది పంచాయతీ బత్తలాపురం గ్రామానికి చెందిన పెద్దరెడ్డెప్ప కుమారుడు దామోదరం(25) సాఫ్ట్‌వేర్ ఇంజినీరుకు పెద్దపంజాణి మండలం పెద్దకాప్పల్లె పంచాయతీ పెనుగొలకల గ్రామానికి చెందిన చంద్రమోహన్ కుమార్తె అనురాధ(19)తో ఏడాది క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. దీపావళి సందర్భంగా పుట్టింటి వారు కుమార్తెకు, అల్లుడికి నోములు ఎత్తివ్వడం ఆచారం కాబట్టి గత నెల 31న దామోదరం అతని భార్య అనురాధతో కలిసి అత్తగారింటికి వెళ్ళి పండగ చూసుకొని,నోములు తీసుకొని అదే రోజు దామోదరం అతని భార్యతో కలిసి తన ద్విచక్రవాహనంలో స్వగ్రామం బత్తలాపురానికి బయలుదేరి వస్తుండగా పెద్దపంజాణి, పుంగనూరు రోడ్డు ఇటుకనెల్లూరు సమీపంలోని నాగలకుంట వద్దకు రాగానే ముగ్గురు గుర్తుతెలియని దుండగులు తమ ద్విచక్రవాహనాన్ని అడ్డగించి కళ్లలో కారం పొడి చల్లి దామోదరంను కత్తితో పొడిచి హత్య చేసి బంగారు నగలు దోచుకెళ్ళినట్లు మృతుడి భార్య అనురాధ కుటుంబ సభ్యులకు,పోలీసులకు తెలిపింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెద్దపంజాణి ఎస్ఐ స్వర్ణతేజ నమోదుచేసి జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు డిఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో సిఐ అశోక్‌కుమార్,ఎస్ఐ స్వర్ణతేజ,ఐడి పార్టీ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి కేసు దర్యాప్తు చేయగా దామోదరం భార్య అనురాధకు నాగిరెడ్డిపల్లె పంచాయతీ టికె పల్లెకు చెందిన ప్రస్తుతం గంగవరం పంచాయతీ ప్రశాంత్‌నగర్‌లో కాపురం ఉంటున్న గంగరాజుతో వివాహం కాక ముందు నుండి వివాహేతర సంబంధం ఉందని ఆయన తెలిపారు. అనురాధ తండ్రి చంద్రమోహన్ వద్ద గంగరాజు పాలు రవాణా చేసేవాడని, దీంతో అనురాధతో పరిచయం ఏర్పడి అప్పటి నుంచే ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుందన్నారు. వివాహమైన తరువాత కూడా అనురాధ గంగరాజుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గంగరాజు అవసరాల నిమిత్తం అనురాధ తన బంగారు నగలను ఇచ్చేసిందన్నారు. ఇటీవల దామోదరం అతని తల్లిదండ్రులు పుంగనూరులో భూమిని కొనాలని అందుకు కొంత నగదు చాలక పోతే భార్య నగలు ఇమ్మని అడగగా అనురాధ తన నగలు తమ పుట్టింట్లో ఉన్నాయని చెప్పి దీపావళి పండగకు వెళ్ళినప్పుడు తీసుకువస్తానని భర్త, అత్తమామలకు చెప్పింది. ఈ విషయాన్ని అనురాధ తన ప్రియుడు గంగరాజుతో చెప్పింది. దీంతో అనురాధ ప్రియుడు గంగరాజుతో కలిసి పక్కాప్రణాళిక సిద్ధం చేసుకొని ఈ దారుణానికి పాల్పడినట్లు ఆయన తెలిపారు. గంగరాజు ముందే మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన పద్మావతి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకొని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని ఆయన తెలిపారు. ప్రియుడితో కలిసి భర్తను తన కనుసన్నల్లోనే హత్య చేయించిన భార్య అనురాధను,గంగరాజును గురువారం ఉదయం కోగిలేరు చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుండి ఆరు బంగారు ఉంగరాలు, ఒక బంగారు నెక్లెస్, బ్రాస్‌లైట్, బంగారు చైన్, ఒక జత బంగారు కమ్మలు, మాటీలు, మూడు సెల్‌ఫోన్‌లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

### వివాహేతర సంబంధమే కారణం : డిఎస్పీ



నిందితుని అరెస్టు చూపిస్తున్న డిఎస్పీ గంగయ్య

# ప్రజల వద్దకు ప్రభుత్వం
## - మంత్రి రోజా



వడమాలపేట, నవంబరు 3 ప్రభాతవార్త:

ప్రజల వద్దకు ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని మంత్రి రోజా తెలిపారు. వడమాలపేట మండలం ఓబీఆర్ కండ్రిగ గ్రామంలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి మంత్రి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, మురికి కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాల అమల్లో దళారీల ప్రాధాన్యత లేకుండా నేరుగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేయడాన్ని ప్రధానంగా తెలియజేశారు. ప్రతి ఇంట్లో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో మంత్రి రోజా ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వడమాలపేట మండలం ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రాష్ట్ర డైరెక్టర్లు, ఆలయ కమిటీ చైర్మన్‌లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఇస్రో అభివృద్ధి ప్రదర్శన
## - పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



గుంటూరు ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో ఇస్రో ప్రదర్శన తిలకిస్తున్న గవర్నర్

శ్రీహరికోట (తడ), నవంబర్ 3 ప్రభాతవార్త

గుంటూరు ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్ వందలాది మందిని ఆకట్టు కుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ డిపార్టుమెంట్ ఆఫ్ ఆటోమిక్ ఎనర్జీల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఈ ఎగ్జిబిషన్ నిర్వహించారు. యూనివర్శిటీలోని ఎపిజె అబ్దుల్‌కలాం ఆడిటోరియంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో షార్ శాస్రతవేత్తలచే ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనతో పాటు రాకెట్ నమూనాలు, శాటిలైట్ల నమూనాలు అంటి వాటిని వేలాది మంది విద్యార్థులు తిలకంచారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని అందరికీ అందించడంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఎప్పుడూ ముందుంటోంది. సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు తమ అభివృద్ధిని ప్రజల ముందు చాటుతున్నారు. గుంటూరులో గురువారం ఏర్పాటు చేసిన ప్రదర్శనలో రాష్ట్ర గవర్నర్ హరిచందన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించిన 70 అభివృద్ధి నమూనాలను తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై బారులుతీరారు. షార్ శాస్త్రవేత్త, ఎంఎస్‌ఏ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డుప్రమాదం

**వెంకటగిరి జెడ్‌పిటిసి, అతని మిత్రుడు మృతి - మరో ఇద్దరికి తీవ్రగాయాలు - ఒకరి పరిస్థితి విషమం**

రేణిగుంట, నవంబరు 3 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గాజుల మండ్యం పోలీస్‌స్టేషన్ పరిధి మర్రిగుంట సమీపం లోని పాపానాయుడు పేట క్రాస్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటగిరి జెడ్‌పి టిసి కోలా వెంకటేశ్వర్లు, అతని మిత్రుడు రమణ య్యనాయుడు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా... తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం ఉప్పరపల్లికి చెందిన వెంకటగిరి జెడ్‌పిటిసి కోలా వెంకటేశ్వరులు, తన మిత్రులు శ్రీనివాసులు, రమణయ్యనాయుడు, డ్రైవర్ వెంకటసుబ్బరాయుల తో కలసి కారులో తిరుపతికి వచ్చారు. పని ముగిం చుకుని అదే కారులో వెంకటగిరి మండలం ఉప్పర పల్లికు వెళుతుండగా వీరు వెళుతున్న వాహనం గాజు లమండ్యం సర్కిల్ దాటి మర్రిగుంట సమీపిస్తుం డగా పాపానాయుడుపేట క్రాస్ వద్ద ఎదురుగా రోడ్డు క్రాస్ చేస్తున్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదం లో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. కారు లో ఉన్న కోలా వెంకటేశ్వరులు అక్కడి కక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తమ సిబ్బందితో సంఘటనా స్థలం చేరుకున్నారు. కారులో చిక్కుకున్న ముగ్గురిని అతి కష్టం మీద బయటకు తీసి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రుయాకు పంపారు. మృతి చెందిన కోలావెంకటేశ్వర్లు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రుయాకు పం పారు. రుయా ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం రమణయ్యనాయుడు, వెంకటసుబ్బరాయులును కరకంబాడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, శ్రీనివాసులను తిరుపతిలోని వేరొక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమణయ్య నాయుడు మృతి చెందాడు. వెంకటసుబ్బరాయులు పరిస్థితి విషమంగా ఉంది. రమణయ్యనాయుడు మృతదేహాన్ని కూడా శవ పరీక్ష నిమిత్తం రుయాకు పంపారు. పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక్కడే తరచూ జరు గుతున్న ప్రమాదాలపై ప్రభాతవార్త ప్రతినిధి ఎస్ఐ ధర్మారెడ్డిని వివరణ కోరగా తిరుపతి ఎస్పీ పరమే శ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తామన్నారు.




రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కారు
మృతి చెందిన కోలా వెంకటేశ్వర్లు (ఫైల్‌ఫోటో)

### ఉష్ణోగ్రతలు
3/11/2022



- తిరుపతి 25 డిగ్రీలు
- చిత్తూరు 27 డిగ్రీలు
- మదనపల్లి 20 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 26 డిగ్రీలు
- వెంకటగిరి 26 డిగ్రీలు
- గూడూరు 27 డిగ్రీలు

### బంగారం ధరలు
3/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,715
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,144

### కోడిగ్రుడ్ల ధరలు
3/11/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

# మాజీ మంత్రి అయ్యన్న అరెస్టుపై భగ్గుమన్న తెదేపా శ్రేణులు

## - కుప్పంలో డా॥ అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా



కుప్పం, నవంబర్ 3 ప్రభాతవార్త : మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడును సిఐడి పోలీసులుదౌర్జన్యంగా అర్ధరాత్రి అరెస్ట్ చేశారని కుప్పంలో తెదేపా శ్రేణులు భగ్గుమన్నాయి. గురువారం కుప్పం తెదేపా కార్యాలయం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం డా॥ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ అయ్యన్న అరెస్ట్ బిసిలపై సిఎం జగన్‌రెడ్డి జరిపిన మరోదాడిగా అభివర్ణించారు. వైజాగ్‌లో ఆస్తుల కబ్జాకు అడ్డు వస్తున్నాడని అక్రమ అరెస్ట్ చేశారన్నారు. వైకాపా పాలనలో ఇప్పటికే 24మంది బిసి నేతలను హత్య చేశారన్నారు. పదిశాతం బిసి రిజర్వేషన్లు రద్దు చేశారన్నారు. 34వేల కోట్ల బిసి సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. ఆదరణ పథకం రద్దు చేశారని ఉత్తరాంధ్రలో ఆస్తులు, మైనింగ్ కబ్జాలకు అడ్డంకిగా అయ్యన్న ఉన్నారని ఆయన కుటుంబంపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత గోపీనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, గుడుపల్లె అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు, సెల్వరాజ్, సురేష్, నేతలు సత్యేంద్రశేఖర్, మంజునాథ్, ఆర్ముగం, త్రిలోక్, జయరాంనాయుడు, మురుగేష్, వెంకటేష్,తెలుగుయువత అధ్యక్షుడు మణి, రామచంద్ర, విభూషణ్, మునెప్ప, అప్పు, పిఎస్ సతీష్, నరేష్, వసంతమ్మ, అనసూయ,రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలనపై విమర్శిస్తే అక్రమ అరెస్టులా...!

### -అయ్యన్నపాత్రుడు అరెస్టు దారుణం -మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు,నవంబర్ 3 ప్రభాతవార్త: ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తే అక్రమ అరెస్టులు చేస్తారా అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.పట్టణంలో అయ్యన్న పాత్రుడు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక మార్కెట్ కమిటీ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు.ఈ మేరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడిని అర్థరాత్రి అరెస్టు అమానుషమని తెలిపారు.ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను జగన్ ప్రభుత్వం గుర్తు చేస్తుందని విమర్శించారు.ప్రభుత్వ వ్యతిరేక విధానాలపైన ప్రత్యేకంగా జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అవినీతి కార్యాక్రమాలపైన ఉత్తరాంధ్ర గొంతు వినిపిస్తున్న వ్యక్తిని ఆ రకంగా అరెస్టు చేయడం దారుణమన్నారు.సొంత చిన్నాన్న హత్య వెనుక ఏమి జరిగిందో సొంత చెల్లిలే మాట్లాడుతుంటే ఏ విధంగా వారి వ్యవహార శైలి ఉందో ఏ విధంగా పోలీసులు పని చేస్తున్నారనడానికి అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య,సుబ్రమణ్యంగౌడ్,వెంకటరమణారెడ్డి,ఆర్‌బిసి కుట్టి,గిరిబాబు,గ్యాస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తీరప్రాంత రైతులకు... తెలుగు గంగ నీరు కల్పించండి




వాకాడు, నవంబర్ 3, ప్రభాతవార్త : వాకాడు మండలంలోని నిడుగుర్తి, రావిగుంట పాలెం, మూలపడవ, బురదగల్లి కొత్తపాలెం తీరప్రాంత పంచాయితీలో దాదాపు 20 గ్రామాలు వర్షపు నీటిపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. అయితే ఆ ప్రాంతపు నేలలో బోరు బావి వేసుకునే అవకాశాలు లేవు. ఆ భూ పొర అధిక లవణీత ఉంది. అక్కడ రైతులు వ్యవసాయానికి వర్షాదారపు నీటిపై ఆధార పడక తప్పదు. ఈ రుతువుల్లో స్వల్ప కాల వర్షాల వలన సరిపడు నీరు ఆరు మాసాలకు వ్యవసాయం పండించుటకు నీరు సమృద్ధిగా ఉండకపోవడం వలన, ఆశించిన మొత్తంలో దిగుబడి లేక, పెట్టుబడుల కోసం దళారుల దగ్గర వడ్డీలకు తెచ్చిన అప్పు తీర్చుకోలేక చిన్న సన్నకారు రైతులు అప్పులపాలు కాక తప్పట్లేదు ఇటువంటి సమస్యలు అధిగమించడానికి సమీప ప్రాంతంలో రైతులకు జీవనాధారంగా తెలుగు గంగ కాలవ సమీపంలో చిట్టమూరు, మల్లాం ప్రాంతం మీదుగా, రావిగుంట పాలెం సమీప ప్రాంతాలలో ప్రవహిస్తూ బండ్ల రేవు మీదుగా బకింగ్ కెనాల్‌లో వృధాగా నీరు కాలుస్తుంది. తెలుగు గంగ నీరు కాలువల రూపంలో సమీప దగ్గరలో ఉన్న చెరువులకు నీరు వచ్చే వెసులు బాటు కల్పిస్తే దాదాపు 20 గ్రామాల రైతులకు వేల ఎకరాలకు ప్రయోజనం, చిన్నా సన్నకారు రైతులు జీవనాధార పరిశ్రమ వ్యవసాయం అభివృద్ధి కాగలవు. దీనిపై ప్రభుత్వ అధికారులు , ప్రజాప్రతినిధులు దృష్టి సారించి తీరప్రాంత రైతులను ఆదుకోగలరని ఆ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

## డెంగ్యూ వ్యాధితో బాలిక మృతి

### -కరోనా అంటూ పుకార్లు-భయాందోళనకు గురవుతున్న ప్రజలు -అప్రమత్తమైన పంచాయతీ అధికారులు

రేణిగుంట, నవంబరు 3 ప్రభాతవార్త: గురువారం ఉదయం సూర్యుడు ఉదయించక ముందే రేణిగుంట పట్టణంలో కరోనా విజృంభించిందంటూ పుకార్లు, షికార్లు చేశాయి. పంచాయతీ పారిశుధ్య కార్మికులు పట్టణంలోని జీఎం వీధిలో ఉదయాన్నే బ్లీచింగ్ చల్లడం, శానిటైజేషన్ చేయడం, డ్రావణాలను పిచికారి చేయడంతో వస్తున్న వదంతులకు ఊతం పోసినట్లయింది. డెంగ్యూతో ఓ బాలిక మృతి చెందడం వల్ల వ్యాధి ప్రబలకుండా సర్పంచ్ నాగేషం, కార్యదర్శి విజయభాస్కర్ ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వీధిలోపారిశుధ్య చర్యలు చేపట్టారు. రేణిగుంట పట్టణం జీఎం వీధిలో 8వ తరగతి చదువుతున్న ఓ అమ్మాయి తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే ఈ విషయంపై రేణిగుంటలో రకరకాల ప్రచారాలు జరిగాయి. ప్రజలు మర కరోనా వచ్చిందేమోనట్లు భయభ్రాంతులకు గురయ్యారు. వైద్యాధికారులను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని ఎలా మృతి చెందిందో ఇంత వరకు సమాచారం అందలేదన్నారు. బాలిక కరోనాతో మృతి చెంది ఉంటే తక్షణం సమాచారం వచ్చేదన్నారు. ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. డెంగ్యూతో మృతి చెందినట్లు తమకు అనధికారికంగా తెలిసిందన్నారు. ఈ క్రమంలో శుక్రవారం తమ సిబ్బందిని బాలిక చదువుతున్న పాఠశాలకు పంపి డెంగ్యూకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరిస్థితులు విషమించక ముందే ముందు జాగ్రత్తలో భాగంగా రేణిగుంట సర్పంచ్ నాగేషం, కార్యదర్శి విజయభాస్కర్ స్పందించిన తమ పారిశుధ్య కార్మికుల చేత ఆ ప్రాంతంలో శానిటైజేషన్ చేయించారు.

# వెస్ట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఐజి రవిప్రకాష్



తిరుపతి క్రైం, నవంబర్ 3 ప్రభాతవార్త : తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌ను గురువారం అనంతపురం రేంజ్ డిఐజి ఎం. రవిప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డితో కలిసి తిరుపతి వెస్ట్ పోలీసుల పనితీరుపై ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజి రవిప్రకాష్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో తరుచూ నమోదు అవుతున్న సైబర్ మోసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సైబర్ నేరాలపై కేసులు నమోదు చేసి తక్షణమే దర్యాప్తు చేయాలని, సైబర్ నేరాల ఛేదింపుపై దృష్టి పెట్టాలని తెలిపారు. మహిళా పోలీసులు, వాలంటీర్లను సమన్వయం చేసుకుని ఓటిపి ఫ్రాడ్స్, బహుమతుల పేరున జరిగే ఆన్‌లైన్ మోసాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్ని చైతన్యం చేసేందుకు తోడ్పడే కరపత్రాల పంపిణీ, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో రౌడీ కార్యకలాపాలు అధికంగా ఉండేవని ప్రస్తుతం కట్టడిలో ఉన్నప్పటికీ ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. రౌడీల ఆగడాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులు, పోలీసు అధికారులతో ముఖాముఖి మాట్లాడారు. వారి పని తీరుపై ఆరా తీశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది పోలీసులు అని ఆ నమ్మ కాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సహాయం చేయాలన్నారు. తిరుపతి నగరంలో రెసిడెన్సియల్ ఏరియా అధికంగా ఉండటం తగ్గట్టుగా ప్రజలకు భద్రత కల్పించాల న్నారు. నైట్ బీట్లు ముమ్మరం చేయాలి, బ్లూకోల్ట్, రక్షక్‌లు బాగా తిప్పాలని సూచిం చారు. ఈశాన్య రుతు పవనాల ప్రభావం తిరుపతి, చిత్తూరు జిల్లాలపై అధికంగా ఉంటుందని ఎస్డీఆర్ ఎఫ్, రోప్ పార్టీలు సిద్ధంగా ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా సహాయక చర్యలు చేపట్టాల న్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ డిఎస్పీ నరసప్ప, వెస్ట్ సిఐ శివప్రసాద్, ఎస్ఐ ఓటయ్య, రత్నమాల, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం అపహాస్యం-అయ్యన్న అరెస్టుపై టిడిపి శ్రేణుల నిరసన



తిరుపతి,నవంబర్ 3ప్రభాతవార్త: టిడిపి సీనియర్ నేత,మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు అరెస్టు ప్రజాస్వామ్యం అపహాస్యంలా తయారైందని టిడిపి శ్రేణులు నిరసన తెలిపారు. రాష్ట్ర సిఐడి పోలీసులు అక్రమంగా అయ్యన్నను అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు. "సైకో సిఎం డౌన్ డౌన్, శాడిస్ట్ సిఎం డౌన్‌డౌన్"అయ్యన్నను వెంటనే విడుదల చేయాలని నినాదాలుచేశారు. అయ్యన్న అక్రమఅరెస్టును నిరసిస్తూ గురువారం మధ్యాహ్నం ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మ నాయకత్వంలో టిడిపి జాతీయ,రాష్ట్ర,జిల్లా,నగర కమిటీ నాయకులు నరసింహ యాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, బుల్లెట్‌రమణ, శ్రీధర్‌వర్మ, రవినాయుడు, వట్టికుంట శంకర నారాయణ, మహేష్‌యాదవ్, బ్యాంకు శాంతమ్మ, ఆర్‌పి శ్రీనివాసులు, రామ్మూర్తిరాయల్, లత, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, రుద్రకోటి సదాశివం, యాచంద్రనాయుడు, హేమంతరాయల్, ఆముదాల తులసీ, శ్యాంబోలు హరినాథ్, విశ్వనాథ్, ఎస్‌విఎం శ్రీధర్, రత్నం,హేమ, మూర్తియాదవ్ ,జగన్నాధం, రామ్మోహన్, రామకృష్ణ తదితరులు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను అయ్యన్న ఎత్తిచూపారనే కారణంతో కక్షతో పోలీసులును అడ్డుపెట్టుకుని అరెస్టు చేశారన్నారు. అర్ధరాత్రి ఇళ్ళలోకి వచ్చేవారెవరనేది జనం తెల్చుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే బిసి నేతలను లక్ష్యంగా చేసుకుని వైసిపి ప్రభుత్వం అక్రమ కేసుల నమోదు, అరెస్టులకు పాల్పడుతోందని ,అరాచకాలు వృతి మించిపోతున్నాయని, ప్రజలు, బిసిల తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలను సందర్శించిన టిటిడి ఈఓ

తిరుపతి (విద్య), నవంబర్ 3 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలను టిటిడి కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి, సంయుక్త కార్యనిర్వహణాధికారి సదాభార్గవి, విద్యాశాఖాధికారి డా. ఎం. భాస్కర్‌రెడ్డి సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. మహదేవమ్మ ఆధ్వర్యంలో అధ్యాపకులతో, విద్యార్థినులతో పరస్పర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ పద్మావతి మహిళా కళాశాల తితిదేలోని మిగతా కళాశాలల కంటే గొప్పగా ఉండాలన్నారు. అలా ఉండాలంటే క్షేత్ర స్థాయిలో అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. మనసా, వాచా, కర్మణా పని చేసినట్లయితే విద్యా సంస్థ ప్రగతి పథంలో నడుస్తుంద న్నారు. భారత, భాగవత, రామాయణంలోని గురుశిష్య సంబంధాలను గురించి దాని విశిష్టతను శ్రీ కృష్ణుడు, అర్జునుడు, ద్రోణుడు – ఏకలవ్యుడు, రాముడు హనుమంతుడు, శ్రీ మహా విష్ణువు గజేంద్రుడు వంటి వాళ్ళని ఉదహరిస్తూ చెప్పారు. గురువుకి సమాజంలో అత్యున్నత స్థానం వుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్చార్జి డా. పి. భువనేశ్వరి దేవి, డా. ఉమారాణి, వార్డెన్ డా. విద్యులత, డా. లక్ష్మి, గార్డెన్ డిపార్ట్‌మెంట్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ సిఈ నాగేశ్వర రావు, డిఎఫ్ఓ, పిఆర్ఓ రవి, తిరుమల తిరుపతి దేవస్థానం వారు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అమ్మవారి పంచమితీర్థానికి పటిష్ట ఏర్పాట్లు

### -శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహించిన జేఈఓ వీరబ్రహ్మం

తిరుచానూరు,నవంబర్ 3 ప్రభాతవార్త:తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుండి 28వ తేదీ వరకు జరగనున్నాయి.బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన పంచమితీర్థానికి భక్తులు విశేషంగా వస్తారు కాబట్టి పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నామని జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు.ఈ సందర్భంగా తిరుమల నుండి వచ్చే శ్రీవారి సారె ఊరేగింపు ట్రయల్ రన్‌ను గురువారం నిర్వహించారు. అనంతరం తోలప్పగార్డెన్స్‌లో గల అన్నప్రసాద భవనం సమావేశ మందిరంలో పంచమితీర్థం ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ తిరుమల నుండి వచ్చే సారె ఊరేగింపు రూట్ మ్యాప్‌ను పరిశీలించి,ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం స్థానిక పోలీసుల సహకారం తీసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.పుష్కరిణిలోకి వెళ్లేందుకు,అలాగే తిరిగి వెలుపలకు వచ్చేందుకు ఎన్ని గేట్లు ఉన్నాయి,రెండోసారి భక్తులు ప్రవేశించేందుకు తీసుకోవాల్సిన చర్యలు,పుష్కరిణి వద్ద భద్రత ఏర్పాట్లపై ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం పుష్కరిణి వద్ద పంచమితీర్థం ఏర్పాట్లను జేఈఓ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్వో నరసింహ కిషోర్,అదనపు ఎస్పీ కులశేఖర్,ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖ్‌కుమార్,డిప్యూటీ ఈఓ లోకనాథం,విజిఓ మనోహర్,ఈస్ట్ డిఎస్పీ మురళీకృష్ణ,ఏవిఎస్ఓ శైలేంద్రబాబు,సిఐ సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డి



కాణిపాకం, నవంబర్ 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని గురువారం పట్టభద్రుల నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. బాబుతో కలసి దర్శించుకున్నారు. ఆలయ దర్శ నార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలి కి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చి త్రాపటాన్ని, ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరిండెంట్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు, నవంబర్ 3 ప్రభాతవార్త: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్, డిప్యుటీ సిఎం నారాయణస్వామి, జిల్లా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, కలెక్టర్ హరినారాయణన్‌లతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల ప్రగతికి సంబంధించి సమీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు

## రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలో విశ్వం విద్యార్థి యశ్వంత్‌కి బంగారు పతకం



తిరుపతి (క్రీడా), నవంబర్ 3 ప్రభాతవార్త : తిరుపతిలోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎం. యశ్వంత్ విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలో పాల్గొని వివిధ విభాగాలో 2 బంగారు పతకాలు, 2 వెండి పతకాలను సాధించి జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైయ్యాడు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించి జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలోను సత్తాచాటి రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## గొల్లవాణిగుంట రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి

### అంకుర, హీరో హోండా మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించిన మేయర్ డాక్టర్. శిరీష

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 3, ప్రభాతవార్త : గొల్లవాణిగుంట రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, అధికారులు ఆదేశించారు. రెండో డివిజన్ గొల్లవాణిగుంట నుండి తిరుచానూర్ 150 బైపాస్ రోడ్డు కలుపుతూ గొల్లవాణిగుంట రోడ్డు మీదగా ఏర్పాటు చేస్తున్న 60 అడుగుల రోడ్డు నిర్మాణం పనులను గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మేయర్ అడిగి తెలుసుకున్నారు. గొల్లవాణిగుంట జరుగుతున్న 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నామని సదరు రోడ్డు నందు సిమెంట్ రోడ్డు పనులు ఒక సైడు పూర్తి కావస్తుందని, మగిలిన పనులు తర్వాత పూర్తి చేస్తున్నామని అధికారులు తెలియజేసారు. మేయర్ శిరీష గత కౌన్సిల్ నందు ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రోడ్డుకు కలిగివుందని అన్నారు. అంకుర హాస్పిటల్ మాస్టర్ ప్లాన్ రోడ్డు, కచ్చారోడ్లును, బిటీ రోడ్డుకు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మేయర్ వెంట అసిస్టెంట్ సిటీ ప్లానర్ షణ్ముగం, బిల్డింగ్ ఇన్స్పెక్టర్ జగదీష్, ప్లానింగ్‌కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన కల్యాణవేంకటేశ్వరుని కార్తీక తెప్పోత్సవాలు



నారాయణవనం, నవంబర్ 3 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి టిటిడి అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. ఐదురోజుల పాటు జరిగే ఈ కార్తీక తెప్పోత్సవాలను నిర్వహించడానికి టిటిడి అధికారులు అన్నిరకాల ఏర్పాట్లను ఘనంగా చేపట్టడం జరిగింది. ఉత్సవాల్లో మొదటిరోజు గురు వారం ఉదయం అమ్మవారికి, స్వామివారికి ఉదయం సుప్రభాతసేవలతో మేల్కొలిపి, శుద్ధి, నిత్యకైంకర్యపూజయ బలి, శాత్తుమొర నిర్వహించారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి స్నపనతిరుమంజనం నిర్వహించారు.

**సీతారామలక్ష్మణ అవతారంలో తెప్పపై ఊరేగిన శ్రీవారు :**

కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు గురువారం రాత్రి 7గంటలకు శ్రీవారు సీతారాముల సమేత లక్ష్మణ అవతారంలో తెప్పపై ఘనంగా ఊరేగారు. అంతకుముందు స్వామి,అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, శ్రీనివాసభట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్యలు, భక్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యన్న అరెస్ట్ అరాచక పాలనకు నిదర్శనం : టిడిపి




పుత్తూరు, నవంబరు 3 ప్రభాతవార్త : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అరెస్ట్ రాష్ట్రంలో వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. అర్ధరాత్రి అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి ఆధ్వర్యంలో నల్ల కండువాలు ధరించి గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన, పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు మాట్లాడుతూ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసిన అయ్యన్న పాత్రుడును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ, బిసి నాయకులపై దౌర్జన్యాలు చేస్తూ అక్రమంగా కేసులు పెడుతున్నారని విమర్శించారు. అర్ధరాత్రి ఇంట్లో దొంగలు చొరబడినట్టు పోలీసులు గోడలు దూకి అయ్యన్న ఇంట్లోకి వెళ్లి అరెస్ట్ చేయడం నియంత పాలనను తలపిస్తోందన్నారు. సిఎం, సిఐడి డౌన్ డౌన్ అంటూ పెద్దగా నినాదాలు చేశారు. కార్య క్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు డి.ఎస్.గణేష్, మునిసిపల్ మాజీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లు యుగంధర్, ఆనంద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హస్తకళాకారులను అన్ని విధాల ఆదుకుంటాం-రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్



తొట్టంబేడు, నవంబర్ 3 ప్రభాతవార్త : హస్తకళాకారులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర హస్తకళాకారుల అభివృద్ధి ఛైర్ పర్సన్ బి.విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండ లంలోని బోనుపల్లి, కంచనపల్లితో పాటు కెవిబిపురం మండలం లోని పవనవారికండ్రిగ గ్రామంలో ఉన్న హస్తకళాకారుల పరిస్థితిని పరిశీలించారు. బోనుపల్లి, హరిజనవాడ గ్రామంలో సుమారు 70మంది వరకు హస్తకళాకారులు ఉండగా వారు తయారుచేసే బొమ్మలకు సరైన ధరలేకపోవడంతో కొందరు ఇతర పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు.దీంతో బోనుపల్లిలో హస్తకళాకారుల పరిస్థితులను ఆమె స్వయంగా తెలుసుకున్నారు. వారితో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడుతూ తాము తయారుచేసిన బొమ్మలకు సరైన ధర లేక నష్టపోతున్నామని తెలిపారు. దీనిపై ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ నేడు మార్కెట్‌లో ఏబొమ్మలకు డిమాండు ఉంటుందో వాటిని తయారుచేసినట్లయితే బాగుం టుందని కళాకారులకు తెలిపారు. ముఖ్యంగా వెంకటేశ్వరస్వామి ప్రతిమలను తయారుచేస్తే బాగుం టుందని దీనికి ప్రస్తుతం డిమాండ్ ఉందన్నారు. కళాకారులు నష్టపోకుండా వారి వస్తువులను నేరుగా విక్రయించు కునేందుకు జిల్లా, గ్రామాల్లో క్రాఫ్ట్ విలేజ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఆమె కళాకా రులు తయారుచేసిన వెంకటేశ్వరస్వామి ప్రతిమ లను పరిశీలించారు. అంతేకాకుండా ఆమె స్వయంగా బొమ్మలను చెక్కడం గమనించదగ్గ విషయం. ఆమెతోపాటు రాష్ట్ర మాజీ చేనేత సమస్యల పరిష్కార కమిటీ సభ్యులు చంద్రమౌళి, లేపాక్షి ఎంపోరియం మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం

### - జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్



చిత్తూరు, నవంబర్ 3 ప్రభాతవార్త: జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు నమోదు ప్రక్రియను వేగవతం చేసినట్లు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అమరావతి నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ ముకేష్ కుమార్ మీనా గురువారం సాయంత్రం కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్‌లు పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు గతంలో జరిగిన ఎన్నికల్లో 8,777 మంది ఉపాధ్యాయులు, 73,685 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకొన్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలకు 2.05 లక్షల మంది ఓటర్ల కోసం దరఖాస్తు చేసుకోగా చిత్తూరు జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు 28,122 దరఖాస్తులు మాత్రం అందాయని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మూడు జిల్లాలకు సంబంధించి 8,400 దరఖాస్తులు అందగా చిత్తూరు జిల్లా నుండి 1,024 దరఖాస్తులు అందాయని జాయింట్ కలెక్టర్ ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పుంగనూరు, పూతలపట్టు, జిడినెల్లూరు ఇఆర్ఓలు ప్రభాకర్‌రెడ్డి, పర్వీన్, భవానీలు, ఎలక్షన్ సెక్షన్ సూపరిటెండెంట్ పద్మజ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.